కొండాపూర్ ఆర్టీఏ ఆఫీసు వద్ద రోడ్‌షోలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

బడంగ్‌పేట గాంధీనగర్ చౌరస్తాలో మద్దతు తెలుపుతున్న మహిళలు

నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I హైదరాబాద్, మంగళవారం 7 మే 2024 | RANGAREDDY

36 గంటల్లో గ్రేటర్‌కు వర్ష సూచన

ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలు జారీ .. స్వల్పంగా తగ్గిన ఉష్ణోగ్రతలు

సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల 36 గంటల్లో గ్రేటర్‌లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ మేరకు వాతావరణ కేంద్రం అధికారులు గ్రేటర్‌కు ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. దీని ప్రభావంతో సోమవారం నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆదివారం నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42.8డిగ్రీలు నమోదవగా సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు 0.9 డిగ్రీలు తగ్గి 41.9డిగ్రీల సెల్సియస్‌గాను, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 28.1డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 26 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

శంషాబాద్ బస్టాండ్ వద్ద రోడ్ షోలో

ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మోసాల బడేభాయ్.. కోతల చోటేభాయ్‌లకు ఓటుతో బుద్ధి చెబుదాం

- మోదీకి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాల్సిందే
- తెలంగాణ కోసం పోరాడేది ఒక్క బీఆర్ఎస్సే
- 96 బీసీ కులాలను ఏకం చేసిన కాసానిని గెలిపించుకోవాలె
- చేవెళ్ల పార్లమెంటు పరిధిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో

సిటీబ్యూరో, మే 6, (నమస్తే తెలంగాణ) : పదేండ్లలో హైదరాబాద్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఇవ్వని ప్రధాని నరేంద్ర మోదీకి ఈ పార్లమెంటు ఎన్నికల్లో నగర ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా కేటీఆర్ ప్రచారం నిర్వహించారు. శేరిలింగంపల్లిలోని కొండాపూర్, రాజేంద్రనగర్‌లోని శంషాబాద్ బస్టాండ్, మహేశ్వరంలోని బడంగ్‌పేట గాంధీనగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో కేటీఆర్ ప్రసంగించారు. కేసీఆర్ యాదాద్రి దేవాలయంతో పాటు ఆధునిక దేవాలయమైన కాళేశ్వరం వంటి ప్రాజెక్టును నిర్మించి.. రిజర్వాయర్లకు దేవుళ్ల పేర్లు పెట్టారని, దేవుళ్ల పేరుతో ఏనాడూ రాజకీయం చేయలేదని కేటీఆర్ గుర్తు చేశారు. ముస్లింపై మోదీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, పదేండ్లుగా ప్రధానిగా పనిచేసిన వ్యక్తి ఇలాగేనా మాట్లాడేది అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ఎప్పుడూ మతం పేరుతో రాజకీయాలు చేయలేదని, దేశంలోనే అత్యంత సామరస్యంగా ఉండే నగరాల్లో హైదరాబాద్ ఒక్కటిగా నిలిపామని కేటీఆర్ వివరించారు. ఇలాంటి హైదరాబాద్ నగరాన్ని మోదీ ఆగం చేయాలని చూస్తున్నారని, నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా చేసి.. లూటీ చేసే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని అడ్డుకోవాలంటే పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని కేటీఆర్ అన్నారు. 2014, 2019లో బీజేపీ గెలుపును అడ్డుకున్నది కేసీఆర్ మాత్రమేనని, 2023లో కూడా బీజేపీలోని పెద్ద పెద్ద లీడర్లను కూడా ఓడించింది కూడా బీఆర్ఎస్సేనని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడేది ఒక్క బీఆర్ఎస్ పార్టీయేనని అన్నారు.

కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలె..

పోరపాటున కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. అది బీజేపీకి వేసినట్టే అవుతుందని, ఎన్నికలయ్యాక రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్తారని కేటీఆర్ చెప్పారు. రేవంత్‌రెడ్డిని నమ్ముకుంటే ఒక్క హామీ కూడా అమలు కాదని, తులం బంగారం రాదు, మహిళలకు రూ. 2500లు, పింఛన్ రూ.4వేలు, కనీసం స్కూటీలు కూడా రావని ఎద్దేవా చేశారు.'ఇచ్చిన హామీలు అమలు చేయని రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ సర్కారుకు కర్రుకాల్చి వాత పెట్టాలె'.. అని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వచ్చాక కరెంటు కోతలు, తాగునీటి గోసలు వచ్చాయని, రియల్ ఎస్టేట్ ఢమాల్ అయిందన్నారు. కాంగ్రెస్ సర్కారుకు కొత్త కంపెనీలను తీసుకొచ్చే ముఖం లేదని, ఉన్న కంపెనీలు గుజరాత్, చెన్నైకి తరలిపోతున్నాయన్నారు. చిల్లర మాటలు, ఉద్దెర పనులే తప్ప.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం సీఎం రేవంత్‌రెడ్డితో కాదన్నారు. 'కాంగ్రెస్ తెచ్చిన మార్పు బాగాలేకపోతే ఆ పార్టీని చీరి చింతకు కట్టేయాలే' అని అన్నారు. 96 బీసీ కులాలను ఏకం చేసిన కాసానిని గెలిపించుకొని బీసీల చైతన్యం చూపాలన్నారు.

మనసు నిండా కేసీఆర్‌పై ప్రేమ..

గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆరే సీఎంగా ఉండాలని గ్రేటర్ ప్రజలు కోరుకున్నారని, అందుకే కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని కేటీఆర్ అన్నారు. 16 సీట్లు ఇచ్చినందుకు హైదరాబాద్ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపించడంతో జిల్లాల్లో ప్రజలు కాస్త ఆగమయ్యారని.. అయితే మనసు నిండా కేసీఆర్ మీద ప్రేమ ఉన్నదన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండేదని అనుకునేవాళ్లంతా 13న కారు గుర్తుపై ఓటేసి.. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 10-12 సీట్లు అప్పజెప్పితే.. ఆరు నెలల్లో కేసీఆర్ మళ్లీ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారని కేటీఆర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డిలతో పాటు సీనియర్ నాయకులు కార్తిక్‌రెడ్డి, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ ఆర్టీఏ ఆఫీసు వద్ద కేటీఆర్ రోడ్ షోకు భారీగా హాజరైన జనం

చందనవెల్లిలో కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి కాసాని చంద్రకళ, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి సతీమణి పట్నం సాన్వీరెడ్డి

కాసానిని గెలిపించండి

జ్ఞానేశ్వర్ సతీమణి చంద్రకళ

షాబాద్, మే 6: బీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి కాసాని చంద్రకళ, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి సతీమణి పట్నం సాన్వీరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాగరకుంట, బోనగిరిపల్లి, దైవాలగూడ, చందనవెల్లి గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పలు గ్రామాల్లో మహిళలు రామక్క పాటకు డ్యాన్సు చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోయాయన్నారు. కరెంట్, నీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారని ఆరోపించారు. చేవెళ్ల ఎంపీగా బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీల కల్లబొల్లి మాటలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, కాసాని జ్ఞానేశ్వర్ కుమార్తె మాధవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, శేరిగూడెం వెంకటయ్య, మాజీ సర్పంచులు కొలన్ ప్రభాకర్‌రెడ్డి, పోనమోని కేతన, మాజీ ఎంపీటీసీ గడీల నీరజ, నాయకులు కృష్ణాగౌడ్, విష్ణు, రమేశ్‌యాదవ్, రాందేవ్‌యాదవ్, వెంకటయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ హామీలన్నీ డ్రామాలే..

- అబద్ధాలు చెప్పి అధికారంలోకి కాంగ్రెస్
- కరవుతోపాటు కష్టాలను తెచ్చిన హస్తం పార్టీ
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- తారామతిపేటలో క్యామ మల్లేశ్‌తో కలిసి ప్రచారం

పెద్దఅంబర్‌పేట, మే 6: కాంగ్రెస్ ఇచ్చే హామీలన్నీ డ్రామాలేనని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేటలో నిర్వహించిన రోడ్ షోలో వారు మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే కరువొచ్చిందని, ప్రజలకు కష్టాలూ వచ్చాయని ఆరోపించారు. లేనిపోని హామీలతో అబద్ధాలు చెప్పి మభ్యపెట్టిన హస్తం పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలు అంటూ మాయమాటలు చెప్పి, కాంగ్రెస్ చేతులెత్తేసిందని విమర్శించారు. హామీలు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ వాటిని అమలుపర్చడంలో కాంగ్రెస్‌కు లేదన్నారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశం మొత్తం బడాబాబుల చేతుల్లోకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతుక క్యామ మల్లేశ్‌కు మద్దతు తెలుపాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌గౌడ్, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తారామతిపేట రోడ్‌షోలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి. చిత్రంలో పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ నేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

రోడ్ షోకు హాజరైన జనం